సాక్షి వరంగల్

సోమవారం । 11 । ఆగస్టు । 2025



రామప్ప కీర్తిని చాటేలా..
పర్యాటక జిల్లాగా పేరొందిన ములుగు జిల్లాలోని కూడళ్లను అందంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.
- 8లో▸



కబ్జా చేశాడు..అద్దెకిచ్చాడు!
చింతగట్టు క్యాంపు సమీపంలో ఓ వ్యక్తి ఎస్సారెస్పీ భూమిని కబ్జా చేసి.. ఆపై ఇసుక లారీల పార్కింగ్‌కు అద్దెకిచ్చాడు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
31⁰/24⁰

వాతావరణం
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల సాధారణ నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘నిమ్స్’ అధికారికి ఎంపీ బలరాం నాయక్ పరామర్శ



గీసుకొండ: మండలంలోని ఎలుకుర్తిహవేలి గ్రామంలో హైదరాబాద్ ‘నిమ్స్’ ఆస్పత్రి లైజనింగ్ అధికారి డాక్టర్ మార్త రమేశ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఆదివారం డాక్టర్ రమేశ్ ఇంటికి చేరుకుని పరామర్శించారు. అలాగే బీజేపీ మాజీ ఎంపీ బీబీ పాటిల్, కాంగ్రెస్ మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, రిటైర్డ్ డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ తిప్పారపు రవీందర్, కాంగ్రెస్ నాయకులు బొడిగె శోభన్‌బాబు తదితరులు మార్త రమేశ్‌ను కలిసి సానుభూతి ప్రకటించారు.

‘పాకాల’లో పర్యాటకుల సందడి



ఖానాపురం: మండలంలోని పాకాల సరస్సు వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. విద్యార్థులకు వరుసగా రెండురోజులు సెలవులు కావడంతో నర్సంపేట డివిజన్‌తోపాటు వరంగల్, మహబూబాబాద్, కొత్తగూడ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు భారీగా తరలివచ్చారు. తూముద్వారా లీకేజీ అవుతున్న నీటిలో జలకాలాడుతూ ఉత్సాహంగా గడిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన పార్కులో పిల్లలు ఆటలాడారు. బోటింగ్ చేస్తూ అందాలను వీక్షించారు.

26.5 ఫీట్లకు చేరిన నీరు..

పాకాల సరస్సు నీటిమట్టం 26.5 ఫీట్లకు చేరింది. పూర్తిస్థాయి నీటిమట్టం 30.3 ఫీట్లు. కురుస్తున్న వర్షాలతో సరస్సులోకి నీటిమట్టం వచ్చి చేరింది. మరో 3.8 ఫీట్ల నీరు చేరితే సరస్సు మత్తడిపోయనుంది.

ఖాళీ బిందెలతో రోడ్డెక్కి..



నల్లబెల్లి: మండల కేంద్ర శివారు మూడుచెక్కలపల్లి తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బస్టాండ్ ఆవరణలో మహిళలు ఆదివారం రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. 15 రోజులుగా తాగునీరు అందడంలేదని వాపోయారు. గ్రామంలో అధికారులు ఐదు బోర్లు వేశారని, కానీ తరచుగా రిపేర్లకు వస్తుండడంతో ఏ ఒక్క బోరు కూడా పనిచేయడం లేదన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తి అయినా.. కొన్నాళ్లు మాజీ సర్పంచ్ పూల్‌సింగ్ బోర్ల మరమ్మతు పనులు చేయించి మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకున్నారని చెప్పారు. కానీ ప్రభుత్వం నుంచి పెండింగ్ బిల్లులతో పాటు ప్రస్తుతం చేపట్టిన పనులకు సైతం అధికారులు బిల్లులు చేయకపోవడంతో మరమ్మతు పనులు చేపించేందుకు ఎవరూ ముందుకు రావడంలేదన్నారు. అప్పులు తెచ్చి అభివృద్ధి పనులు చేయించలేనని పంచాయతీ కార్యదర్శి సెలవులో వెళ్లినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో తొగర్రాయి వాసి మృతి



చిలువేరు సాగర్(ఫైల్)

దుగ్గొండి: ప్రమాదవశాత్తు మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన చిలువేరు సాగర్ (23) ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. గ్రామానికి చెందిన చిలువేరు నారాయణ చిన్న కుమారుడు చిలువేరు సాగర్ మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని ఓ డిఫెన్స్ అకాడమీలో కొంతకాలంగా శిక్షణ పొందుతున్నాడు. ఈక్రమంలో సాయంత్రం తన మిత్రులు రాకేశ్, విష్ణువర్ధన్‌తో కలిసి ఓ ఫంక్షన్‌కు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో సాగర్ అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్ననాటి నుంచి దేశానికి సేవ చేయాలన్న కల నెరవేరకుండానే మృత్యుఒడిలోకి చేరాడని సాగర్ తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

చల్లంగా చూడు తల్లీ

- భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు
- భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు



సంగెంలో బోనాలు తీసుకుని వెళ్తున్న భక్తులు

సంగెం/గీసుకొండ/రాయపర్తి: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను సంగెం, గీసుకొండ, రాయపర్తి మండలాల్లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామదేవత పోచమ్మతల్లికి నైవేద్యం సమర్పించి, కోళ్లు, గొర్రెలు, మేకలు బలిచ్చి మొక్కులు చెల్లించారు. వర్షాలు బాగా కురిసి పాడిపంటలు వృద్ధి చెందాలని గ్రామస్తులు పిల్లపాపలతో కలిసి వేడుకున్నారు. గ్రామానికి ఎలాంటి కీడు సోకకుండా చూడాలని మొక్కులు అప్పజెప్పారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.



రాయపర్తి మండలం మైలారంలో బోనాలతో వస్తున్న మహిళలు



సంగెంలో పోచమ్మ గుడి వద్ద మొక్కులు సమర్పిస్తున్న భక్తులు



గీసుకొండలో బోనాలతో తరలివెళ్తున్న మహిళలు



ఎలుకుర్తిలో బోనాలతో పోచమ్మ ఆలయానికి వెళ్తున్న మహిళలు

నీలి నీడలు

మత్స్యసంఘాలకు సరఫరా చేసే చేపపిల్లలను పరిశీలిస్తున్న జిల్లా మత్స్య శాఖ అధికారి నాగమణి, తదితరులు (ఫైల్)

- చేపపిల్లల పంపిణీ ఉన్నట్టా..లేనట్టా?
- గతేడాది లక్ష్యానికి సగం మేరకే పంపిణీ
- ఈ ఏడాది కనీసం టెండర్ల ఊసెత్తని రాష్ట్ర ప్రభుత్వం
- ఆలస్యం కావడం, నాసిరకం చేపపిల్లల పంపిణీతో మత్స్యకారులకు నష్టం
- నగదు బదిలీ చేస్తే మేలంటున్న మత్స్యసంఘాలు



జిల్లాలో మొత్తం చెరువులు	చెరువుల్లో వదలాల్సిన చేపపిల్లలు	మత్స్య సంఘాల్లోని సభ్యులు
702	1.90 కోట్లు	15,741 మంది
మొత్తం చెరువుల నీటి విస్తీర్ణం 12,910 హెక్టార్లు	మత్స్య సంఘాలు 184	

గీసుకొండ: జిల్లాలో మత్స్యకారులకు ఉచిత చేపపిల్లల పంపిణీపై నీలినీడలు అలుముకున్నాయి. వంద శాతం సబ్సిడీపై 2016లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపపిల్లల ఉచిత పంపిణీకి శ్రీకారం చుట్టినా సకాలంలో ఏ ఒక్క ఏడాది కూడా చెరువులకు చేపపిల్లలు చేరిన దాఖలాలు లేవనే ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా చేపపిల్లల సరఫరాకు టెండర్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ఏడాది ఆగస్టు నెల నడుస్తున్నా ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉచిత చేపపిల్లల పంపిణీపై ఎలాంటి సంకేతాలు లేకపోవడంతో అసలు చేపపిల్లల పంపిణీ ఉన్నట్టా..లేనట్టా అనే సందేహాలు మత్స్యకారుల సంఘాల్లో తలెత్తుతున్నాయి. సకాలంలో చేపపిల్లలను చెరువుల్లో వదలనట్‌లైతే వాటి ఎదుగుదల సరిగా ఉండక తాము నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు టెండర్లకు సంబంధించి ప్రభుత్వం, మత్స్యశాఖ ఊసెత్తకపోవడంతో అసలు పథకాన్ని కొనసాగిస్తారా..? లేదా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాదైనా ముందస్తుగా టెండర్లు పిలుస్తారని అనుకుంటే ఇప్పటివరకూ ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదు.

ఎలాంటి కసరత్తు లేదు..

ప్రతీ ఏడాది వేసవి కాలం ముగిసే నాటికే ప్రభుత్వం చేపపిల్లలకు సంబంధించిన టెండర్లు పిలిచేది. గతేడాది ఊరించి..ఊరించి ఆలస్యంగా లక్ష్యానికి కోతపెట్టి సగం మేరకే చేపపిల్లలను పంపిణీ చేశారు. ఆలస్యం కావడంతో ఆ చేపపిల్లలు ఎదుగుదల లేక మత్స్యకారులు ఇబ్బందులు పడ్డారు. సమయానికి వదలకపోవడం వల్ల చేపల్లో ఎదుగుదల లేకపోవడంతో తమకు గిట్టుబాటు ధర రావడం లేదని అంటున్నారు. కిలో నుంచి రెండు మూడు కిలోల వరకు చేపలు ఎదగాలంటే పిల్లలను సకాలంలో చెరువుల్లో వదలాల్సి ఉంటుందని, అప్పుడే నాలుగు నెలల్లో వాటి వృద్ధి జరిగి చేతికొస్తాయని అంటున్నారు. అలాంటి చేపలకే మార్కెట్‌లో మంచి ధర వస్తుందని, వాటిని ఎగుమతి చేయడానికి అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. టెండర్ల విషయమై జిల్లా మత్స్యశాఖ అధికారి(డీఎఫ్‌ఓ)నాగమణిని ‘సాక్షి’ వివరణ కోరగా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. అధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామన్నారు.

ఆగస్టు లోపు వదిలితేనే..

ఆగస్టులోపు చేపపిల్లలను చెరువుల్లో వదిలితే మంచిదని మత్స్యశాఖ అధికారులే చెబుతున్నారు. కానీ ఈ ప్రక్రియ ప్రతి ఏడాది ఆలస్యంగానే జరుగుతోంది. లోపాలను అధిగమించి ముందస్తుగా నిధులను సమకూర్చుకోవడంలో మత్స్యశాఖ విఫలం అవుతోందని విమర్శలు ఉన్నాయి. గతేడాది వర్షాకాలంలో జిల్లాలోని చెరువుల్లో లక్ష్యం మేరకు కాకుండా అందులో సగమే చేపపిల్లలను మత్స్య సంఘాల వారికి పంపిణీ చేశారు. జిల్లాలో సుమారు 1.93 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయాల్సి ఉండగా అందులో సగమే, అది కూడా చాలా ఆలస్యంగా పంపిణీ జరిగిందని మత్స్యసంఘాల వారు అంటున్నారు. గతేడాది రెండు ఏజెన్సీలు టెండర్లను దక్కించుకుని చేపపిల్లలను అందించాయి. అయితే చేపపిల్లలు చాలా చిన్న సైజులో నాసిరకంగా ఉండటం, అదను దాటిన తర్వాత ఆలస్యంగా చెరువుల్లో పోయడంతో పెద్దగా ఎదగలేదని మత్స్యసంఘాల వారు ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమకు నష్టం తప్ప లాభం రాదని చెబుతున్నారు.

సొంతంగా కొనుగోలుకు మొగ్గు

చేపపిల్లల పంపిణీ ప్రతీ ఏడాది ఆలస్యం అవుతుండటంతో పలు మత్స్యసంఘాల వారు నీరు చేరిన జలాశయాల్లో సొంత ఖర్చుతో చేపపిల్లలను కొనుగోలు చేసి వదులుతున్నారు. ఆంధ్రా ప్రాంతం నుంచి పెద్ద సైజు (ఫింగర్ లింగ్స్) చేపపిల్లలను కొనుగోలు చేసి చెరువుల్లో వదలడానికి సిద్ధం అవుతున్నారు.

నగదు బదిలీ చేస్తే మేలు..

జిల్లాలో చాలా మత్స్యసంఘాలు ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై అందించే చేపపిల్లలు నాసిరకంగా ఉంటున్నాయనే అభిప్రాయంతో ఉన్నాయి. టెండర్లు దక్కించుకున్న వారు చేపపిల్లలను సరైన సంఖ్య మేరకు చెరువుల్లో వదటడం లేదని, ఆంధ్రా ప్రాంతం నుంచి నాసిరకం పిల్లలను తెచ్చి పంపిణీ చేస్తుండటంతో ఎదుగుదల సరిగా లేక నష్టపోతున్నామని చెబుతున్నారు. ఈ క్రమంలో నగదు బదిలీ చేస్తే తామే మేలైన రకం చేపపిల్లలను కొనుగోలు చేసి సకాలంలో చెరువుల్లో వదిలే అవకాశం ఉంటుందని, ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించాలని అంటున్నారు.

దేవాదుల పనుల్లో నిర్లక్ష్యం వీడాలి



సమీక్షలో మాట్లాడుతున్న నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు

- కాంట్రాక్టర్లు చిత్తశుద్ధితో పనిచేయాలి
- అధికారుల పనితీరులో మార్పు రావాలి
- భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- సమ్మక్క సాగర్ బ్యారేజీ, దేవాదుల వద్ద పంపుహౌస్ పరిశీలన

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటామని, దేవాదుల పనుల్లో కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం వీడాలని, పనులు పెండింగ్‌లో ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీ, దేవాదుల వద్ద పంపుహౌస్‌ను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. తుపాకులగూడేనికి హెలికాప్టర్‌లో చేరుకున్న మంత్రులకు మంత్రి సీతక్క ఆహ్వానం పలికారు. ఆ తర్వాత సమ్మక్క బ్యారేజీ వద్ద 59 గేట్లను పరిశీలించారు. నీటి నిల్వలు ఏ మేరకు ఉన్నాయని, గేట్లు ఎన్ని ఎత్తి, ఎన్ని మూశారని తెలుసుకున్నారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో దేవాదుల పంపుహౌస్ వద్ద ఉన్న గోదావరి నీటి నిల్వలను పరిశీలించి మోటార్లు ఎన్ని నడుస్తున్నాయని, ఎంత నీరు ఎత్తిపోశారని ఆరా తీశారు. ఇరిగేషన్ ఈఎన్‌సీ వెంకటేశ్వర్‌రావు ప్రొజెక్టర్ ద్వారా మంత్రులకు దేవాదుల స్థితిగతులను వివరించారు. అనంతరం సమీక్షలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గోదావరి జలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టిందని, ఈ హైలీ ప్రాజెక్టును టీడీపీ, బీఆర్‌ఎస్ పూర్తి చేయలేదని పేర్కొన్నారు. అప్పుడు చేపట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమే, ఇప్పుడు పూర్తి చేసేది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన స్పష్టం చేశారు. ఇరిగేషన్‌కు రూ.23వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే రూ.16 వేల కోట్లు వడ్డీలు కట్టేందుకే సరిపోతుందన్నారు. కావేరి, గోదావరికి అనుసంధానంగా 200 టీఎంసీల కెపాటీగల ఇచ్చంపల్లి, తుమ్మడిహెట్టి ప్రాజెక్టును నిర్మించి తీరుతామన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మంత్రులతో మాట్లాడి ఎన్‌ఓసీ కూడా తీసుకుంటామన్నారు.

6 లక్షల ఎకరాలకు సాగు నీరు : డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క,


ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మాట్లాడుతూ 17 నియోజకవర్గాల్లో 6 లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలని లక్ష్యంగాపెట్టుకొని దేవాదుల ప్రాజెక్టు నిర్మించామని తెలిపారు. ఇప్పుడు దీని అంచనాలు కూడా మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. 16.38 టీఎంసీల నుంచి 17.38 టీఎంసీలకు పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రూ.16 కోట్లు దేవాదుల భూ నిర్వాసితులకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని వివరించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లిస్తామన్నారు. 72 మీటర్ల నీటిని నిల్వ చేసుకొని మోటార్ల ద్వారా ఎత్తిపోసి రిజర్వాయర్ల నుంచి కెనాల్ ద్వారా సాగు నీరు అందిస్తామని తెలిపారు.

ములుగు జిల్లాకు న్యాయం చేయాలి : మంత్రి సీతక్క

ములుగు జిల్లాలో వంద కిలోమీటర్ల గోదావరి నీటి ప్రవాహం ఉందని మంత్రి సీతక్క అన్నారు. సమైక్య రాష్ట్రంలో ములుగుకు అన్యాయం జరిగిందని, స్వరాష్ట్రంలో న్యాయం చేయాలని ఆమె కోరారు. రామచంద్రపురం గ్రావిటీ కెనాల్ ద్వారా పాకాల, కొత్తగూడెం నీటి సరఫరా చేయాలి. పాట్లాపురం కెనాల్ కోసం సంబంధిత ఫైల్‌ను ప్రభుత్వం వద్ద ఉందని, దానిని పరిశీలించి బడ్జెట్ ఇవ్వాలని, గొరారం, మల్లూరు, రామప్ప, లక్నవరం ప్రాంతాల్లోకి రైతులకు నీరు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, కడియం శ్రీహరి, దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టును పూర్తిచేసి పంటలకు నీళ్లివ్వాలని కోరారు. సమీక్షలో ఇరిగేషన్ కమిషనర్ ప్రశాంత్‌పాటిల్, ఇరిగేషన్ ఈఈ జగదీశ్, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు ఇర్సవడ్ల వెంకన్న, అప్సర్‌పాషా పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలి

- నర్సంపేటలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


నర్సంపేట: తెలంగాణలో 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును తక్షణమే పార్లమెంటులో పెట్టి ఆమోదం తెలపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలో ఆదివారం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అట్టడుగు వర్గాలైన బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించకుండా అణచివేస్తూ దోచుకుంటున్నారని, అందుకు బీజేపీ పాలకులు అన్ని విధాల ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. జనాభాలో ఆరు శాతంలేని అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్ కల్పించి 50శాతం పైగా ఉన్న బీసీలకు కనీసం 62శాతం రిజర్వేషన్ చట్టాన్ని తీసుకురావడానికి అనేక అడ్డంకులు కల్పిస్తూ బీసీలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగి 42 శాతం బీసీ రిజర్వేషన్‌ను అసెంబ్లీలో తీర్మానించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కుంటిసాకులతో ఆమోదించకుండా కాలయాపన చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు గడ్డమీది బాలకృష్ణ, కలకోట అనిల్, వజ్జంతి విజయ, ఉదయగిరి నాగమణి, యాకలక్ష్మి, లక్ష్మి, లింగయ్య, వీరన్న, వెంకన్న, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో రేపు లైబ్రేరియన్స్ డే

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ లైబ్రేరియన్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (కుల్పా), యూనివర్సిటీ లైబ్రరీ సైన్స్ విభాగం, టీఎస్ లైబ్రరీ అసోసియేషన్ (టీఎస్ఎల్‌ఏ) ఆధ్వర్యంలో ఈనెల 12న లైబ్రేరియన్స్ డే నిర్వహించనున్నారు. ఈ మేరకు కేయూ లైబ్రరీ ఇన్‌చార్జ్ ఐసాక్ ప్రభాకర్, టీఎస్ఏ ల్ఏ ట్రెజరర్ జి.రాజేశ్వర్‌కుమార్, కుల్పా ట్రెజరర్ ఎం.మనోహర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపస్‌లోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించే వేడుకలకు ముఖ్య అతిథిగా వీసీ కె.ప్రతాప్ రెడ్డి హాజరుకానున్నారు. కుల్పా అధ్యక్షుడు ఎ.నాగేశ్వర్‌రావు అధ్యక్షత వహిస్తారు. ‘రోల్ ఆఫ్ లైబ్రేరియన్స్ ఇన్ ది డిజిటల్ ఎరా’ అంశంపై లైబ్రరీ సైన్స్‌విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె.రమణయ్య కీలకోపన్యాసం చేస్తారు. ‘రెలవెన్స్ ఆఫ్ డాక్టర్ రంగనాథన్ ఇన్‌ది ఏజ్ ఆఫ్ ఏఐ’ అంశంపై కేయూ లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జ్, లైబ్రరీ సైన్స్ విభాగం అధిపతి రాధికారాణి ప్రసంగిస్తారు. కుల్పా సెక్రటరీ వి.కృష్ణమాచార్య, టీఎస్ఎల్‌ఏ సెక్రటరీ ఇ.సత్యనారాయణరావు పాల్గొంటారు.

నానో నయం!

- ద్రవరూపంలో నానో యూరియా, డీఏపీ..
- గుళిక ఎరువుల కంటే పంటలకు ఎంతో మేలు
- తగ్గనున్న ఖర్చు, పెరగనున్న దిగుబడి
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



నానో యూరియా, నానో డీఏపీ



సంగెం మండలం గవిచర్లలో నానో ఎరువుల పిచికారీని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యశారద(ఫైల్)

సంగెం: కేంద్రప్రభుత్వం గుళికల రూపంలో ఉన్న యూరియా, డీఏపీలకు బదులుగా ద్రవరూపంలో నానో ఎరువులు తయారు చేస్తున్నది. దీంతో రైతులకు ధర తక్కువ కావడమే కాదు రవాణా ఖర్చులు, తిప్పలు తప్పుతున్నాయి. అర లీటరు నానో యూరియా, డీఏపీ బాటిల్, ఒక్క యూరియా, డీఏపీ బస్తాతో సమానంగా పంటపై ప్రభావం చూపుతుందని మండల వ్యవసాయాధికారి సాగరిక చెబుతున్నారు. నానో ఎరువుల ఉపయోగం గురించి రైతులకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో పాటుగా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రైతులు ఇప్పుడిప్పుడే నానో ఎరువులు వాడడానికి ముందుకు వస్తున్నారు.

ధర తక్కువ..

అర లీటరు నానో యూరియా బాటిల్ గుళికల రూపంలో ఉన్న 45 కేజీల బస్తాతో సమానం. అదే విధంగా అరలీటరు నానో డీఏపీ బాటిల్ 50 కేజీల బస్తాతో సమానం. ధర విషయానికోస్తే యూరియా బస్తా రూ. 267 కాగా నానో బాటిల్ కేవలం రూ 225 మాత్రమే. డీఏపీ బస్తా రూ.1,350లు కాగా నానో డీఏపీ రూ. 600 మాత్రమే.

బహుళ ప్రయోజనాలు..

గుళికల రూపంలో ఉన్న యూరియా బస్తాను ఎకరం పొలంలో వాడడం వల్ల 60 శాతం మాత్రమే మొక్క గ్రహించగలుగుతుంది. మిగతా 40శాతం గాలిలో కలిసి వాయుకాలుష్యం ఏర్పడుతుంది. డీఏపీ బస్తాను దుక్కిలో వేయాల్సి ఉంటుంది. కాని కొందరు రైతులు పైపాటుగా వేయడంతో మొక్కలకు ఎలాంటి ఫలితం దక్కడం లేదు. ద్రవ రూపంలో ఉన్న నానో యూరియా, నానో డీఏపీలను నేరుగా గాని ఒక లీటరు నీటికి 4 ఎంఎల్ చొప్పున ఏదైనా పురుగుల మందులతో కలిపి పత్తి, వరి, మొక్కజొన్న, కూరగాయలు తదితర పంటలపై పిచికారీ చేసుకుంటే నేరుగా ఆకుల ద్వారా మొక్క వంద శాతం గ్రహిస్తుంది. ఆకుల్లో కిరణజన్య సంయోగ క్రియ ద్వారా వేర్లలో కణజాల వృద్ధికి ఉపయోగపడుతుంది. వర్షాభావ పరిస్థితులు, అధిక వర్షపాతంలోనూ నానో యూరియా, డీఏపీలను పంటలపై పిచికారి చేసుకోవచ్చు. పంట వేసిన 20–25 రోజుల్లో ఒకసారి, 40–45 రోజుల్లో మరోసారి పిచికారి చేసుకుంటే పంటల ఎదుగుదల బాగుంటుంది. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులను దుక్కిలో వేసుకుని కలియదున్ని పంటలు సాగు చేసిన తర్వాత నానో ఎరువులను పంటలపై పిచికారీ చేస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



గుళికల రూపంలో ఉన్న రసాయనిక ఎరువుల కంటే నానో ఎరువులు మేలు. పంటలకు పైపాటుగా నానో డీఏపీ అర లీటరు, నానో యూరియా అరలీటరులను ఎకరాకు రెండు దఫాలుగా పిచికారీ చేసుకుంటే అధిక దిగుబడులు వస్తాయి.

-సాగరిక, ఏఓ సంగెం

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

- టీపీఆర్‌టీయూ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మన్నె చంద్రయ్య


చంద్రయ్య

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి పోరాడుతామని టీపీఆర్‌టీయూ రాష్ట్ర నూతన అధ్యక్షుడు మన్నె చంద్రయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ ప్రకటించాలని, 317 జీఓతో నష్టపోయిన ఉపాధ్యాయులకు స్థానికత ఆధారంగా బదిలీలు చేపట్టాలని, రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల్లో 10 వేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ రూపొందించి అమలు చేయాలని కోరారు. ఇటీవల తాత్కాలికంగా నిలిచిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ మళ్లీ త్వరితగతిన చేపట్టాలని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత


భక్తురాలికి బంగారం అందజేస్తున్న ఆలయ పర్యవేక్షకుడు విజయ్‌కుమార్

హన్మకొండ కల్చరల్ : వరంగల్ భద్రకాళి దేవాలయంలో ఓ భక్తురాలు పోగొట్టుకున్న బంగారాన్ని సిబ్బంది ఆమెకు అప్పగించారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకోవడానికి హైదరాబాద్ నుంచి వచ్చిన ఓ భక్తురాలి అర్ధతులం చెవికమ్మ ఆలయ ప్రాంగణంలో పడిపోయింది. దీనిని గమనించిన ఓ వ్యక్తి ఆ ఆభరణాన్ని ఆలయ పర్యవేక్షకుడు అద్దంకి విజయ్‌కుమార్‌కు అందజేయగా ఆయన భక్తురాలికి అప్పగించారు. దీంతో భక్తురాలు.. ఆలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ అదుపు తప్పి యువకుడి దుర్మరణం

- మరొకరి పరిస్థితి విషమం
- గణపురం సమీపంలో ఘటన


జగదీశ్ మృతదేహం

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రం సమీపంలోని కోట కాల్వ వద్ద బైక్ అదుపు తప్పింది. ఈ ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. గణపురం ఎస్సై రేఖాఅశోక్ కథనం ప్రకారం.. భూపాలపల్లికి చెందిన దాసరి జగదీశ్(24) ఏసీ టెక్నీషియన్‌గా, తన స్నేహితుడు మర్రికుసుముదార్ జగదీశ్ సింగరేణిలో ఉద్యోగం చేస్తున్నాడు ఆదివారం సెలవు సందర్భంగా ఇద్దరు బైక్‌పై రామప్పకు వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తున్నారు. ఈ క్రమంలో గణపురం మండలకేంద్రం శివారు కోట కాల్వ వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడి పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈఘటనలో దాసరి జగదీశ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో యువకుడు మర్రికుసుముదార్ జగదీశ్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహంతోపాటు క్షతగాత్రుడిని 108లో భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బెల్లం, పటిక పట్టివేత

కాజీపేట రూరల్: 80 కిలోల బెల్లం, 20 కిలోల పటికను కాజీపేట జంక్షన్‌లో పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. కాజీపేట జీఆర్పీ ఎస్సై ఎం.అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా ఈదులపూసపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా అనిల్ ఈ నెల 9వ తేదీన ఇంటి నుంచి బల్లార్షకు వెళ్లి తక్కువ ధరకు బెల్లం, పటిక కొని తిరిగి కాజీపేటకు చేరుకుని వేరే రైలులో మహబూబాబాద్ వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ క్రమంలో సమాచారం మేరకు పోలీసులు రంగంలోకి దిగి అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. బెల్లం, పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అభినవ్ చేసినట్లు వివరించారు.

రామప్ప కీర్తిని చాటేలా..

కాకతీయుల కళావైభవానికి ప్రతీక రామప్ప దేవాలయం. తెలుగు రాష్ట్రాల్లోనే తొలిసారి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు రావడంతో రామప్ప కీర్తి మరోసారి మార్మోగింది. 1213 లో కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు రావడంతో దేశ,విదేశీ పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. పర్యాటక ప్రాంతానికి మారుపేరు ములుగు జిల్లా. రామప్ప ఆలయం, లక్నవరం సరస్సు, మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర, తాడ్వాయి హట్స్, ఏటూరునాగారం అభయారణ్యం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం, బొగత జలపాతంతో పాటు మరికొన్ని జలపాతాలు ములుగు జిల్లాకు ప్రత్యేకం. పర్యాటక జిల్లాగా పేరొందిన ములుగు జిల్లాలోని కూడళ్లను అందంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పలుచోట్ల థీంలు ఏర్పాటు చేస్తుండడంతో కూడళ్లు జిగేల్ మంటున్నాయి.

-వెంకటాపురం(ఎం)


విద్యుత్ కాంతుల్లో డమరుకం


విద్యుత్ కాంతుల్లో నంది విగ్రహం

మరికొన్నిచోట్ల..

జిల్లాలో జంగాలపల్లి కూడలితోపాటు బండారుపల్లి రోడ్డు కూడలి వద్ద 'ఐ లవ్ ములుగు' అనే థీం ఏర్పాటు చేస్తున్నారు. సమ్మక్క–సారలమ్మ తాడ్వాయి మండలం నార్లాపూర్–బయ్యక్కపేట కూడలి వద్ద సమ్మక్క–సారలమ్మ ప్రాచుర్యాన్ని తెలిపేలా కుంకుమ భరిణె థీంను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. మేడారం జాతరలోగా కుంకుమ భరిణె థీంను నెలకొల్పి ఆసియాలోనే అతిపెద్ద జాతరకు వచ్చే భక్తులకు కనువిందు చేయనున్నారు. అదేవిధంగా తాడ్వాయి మండల కేంద్రంలోని మేడారం ఆర్చీ వద్ద ఆదివాసీ జీవన విధానం, వారి సంస్కృతి, సంప్రదాయాలు తెలిపేలా 'ఆదివాసీ బాణం సంధించే థీం' ను అధికారులు ఏర్పాటు చేయనున్నారు.

కాకతీయ కళావైభవంతో మెరిసిపోతున్న జంగాలపల్లి కూడలి

- రూ.2.61 కోట్లతో పూర్తయిన సుందరీకరణ పనులు
- విద్యుత్ వెలుగుల్లో నంది విగ్రహం, డమరుకం, శిలాశాసన మండపం

జిల్లాలో రూ.2.61 కోట్లతో పలు కూడళ్లను అభివృద్ధి చేస్తున్నారు. ములుగు మండలం జంగాలపల్లి క్రాస్ వద్ద సుందరీకరణ పనులు చేపట్టి ఆదివారంతో పూర్తి చేశారు. జంగాలపల్లి క్రాస్‌లోని జంక్షన్‌లో రామప్ప

రామప్ప ఆలయ విశిష్టత తెలియజేసేలా..

ఆలయ విశిష్టత తెలియజేసేలా శివుడి వాహనమైన నందీశ్వరుడిని (నంది విగ్రహాన్ని) ఏర్పాటు చేసి మూడు పక్కల మూడు ఏనుగు విగ్రహాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా శివుడు డమరుకం వాయిస్తున్నట్లు చూపుతూ డమరుకం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. రామప్ప ఆలయాన్ని చూపే విధంగా శిలాశాసన మండపం మాదిరి మండపాన్ని నిర్మించారు. మండపం చుట్టూ ఆరుగురి మదనికల శిల్పాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేసి లోపల గ్రాస్‌తో గ్రీనరీ ఏర్పాటు చేసి వివిధ రకాల పూలమొక్కలు నాటారు. గ్రిల్స్‌కు డమరుకం, త్రిశూలం, శివుని మూడో కన్నుతో కూడిన త్రినయనం చిహ్నాలు నిర్మించారు. రాత్రివేళ విద్యుత్ కాంతుల మధ్య నంది విగ్రహం, డమరుకం, మండపం, మదనికల భంగిమలతో కూడిన శిల్పాలు జిగేల్ మంటున్నాయి. నంది విగ్రహంతోపాటు మండపం నుంచి ఫౌంటేన్‌లా నీరు ఎగిసిపడుతుండడంతో ప్రజలు సెల్ఫీలు దిగుతూ సంబురపడిపోతున్నారు. విద్యుత్ వెలుతురులో కాకతీయ కళావైభవం ఉట్టిపడేలా జంగాలపల్లి కూడలి మెరిసిపోతోంది.


మండపం నుంచి ఫౌంటేన్‌లా జాలువారుతున్న నీరు

కబ్జా చేశాడు.. అద్దెకిచ్చేశాడు!


ఎస్సారెస్పీ భూముల్లో లారీల పార్కింగ్

- రూ.10 కోట్ల భూమి స్వాహా
- దర్జాగా ఇసుక లారీల పార్కింగ్
- అక్రమార్కుడిపై ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు

హసన్‌పర్తి: ఓ అక్రమార్కుడు దర్జాగా ఎస్సారెస్పీ భూములు ఆక్రమించాడు. అంతటితో ఆగలేదు. ఆ భూమిని అద్దెకు ఇచ్చినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల సహకారంతోనే ఈ వ్యవహారం సాగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.10కోట్ల మేరకు భూమి స్వాహా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలోని చింతగట్టు క్యాంపులోని నీటి పారుదలశాఖ ప్రధాన కార్యాలయం సమీపంలో సుమారు రెండెకరాల ఎస్సారెస్పీ భూమి ఉంది. అయితే ఈ స్థలాన్ని మూడేళ్లుగా ఓ అక్రమార్కుడు కబ్జా చేశాడు.

దర్జాగా ఇసుక లారీల పార్కింగ్..

ఈ భూమిలో దర్జాగా ఇసుక లారీల పార్కింగ్ నిర్వహిస్తున్నారు. నెలకు ఒక్కొక్క లారీ యజమాని నుంచి కొంతమొత్తంలో అద్దె డబ్బులు వసూలు చేస్తున్నట్లు స్థానికంగా చెబుతున్నారు. ఈ మాముళ్లలో అధికారులకు కూడా భాగస్వామ్యం ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మూడేళ్లుగా ఇక్కడ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అలాగే, ఈ భూమిలో ఓ డబ్బా కూడా ఏర్పాటు చేశాడు. ఆ డబ్బాలను కూడా అద్దెకిచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

ఇసుక లారీల పార్కింగ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఫలితంగా ఇటు వైపు రాకపోకలు సాగించాలంటే మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారు. లారీ డ్రైవర్లు మద్యం సేవిస్తూ న్యూసెన్స్ చేస్తున్నారని, దీంతో రాత్రి వేళ ఈ మార్గం నుంచి వెళ్లాలంటే భయమేస్తోందని స్థానికులు తెలిపారు. కాగా, కాలనీవాసుల ఇటీవల సమావేశం ఏర్పాటుచేసి లారీల పార్కింగ్ తొలగించకపోతే ఆందోళన చేపడుతామని హెచ్చరించినట్లు తెలిసింది.

> **చర్యలు తీసుకుంటాం**
>
> కబ్జాదారుడిపై చర్యలు తీసుకుంటాం. ఇక్కడ నుంచి లారీల అడ్డాను తొలగిస్తాం. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం
>
> -రాజు, డీఈఈ, నీటిపారుదలశాఖ

సురేశ్‌కు జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న సురేశ్

ఎల్కతుర్తి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామానికి చెందిన నల్లగొండ సురేశ్ గిడుగు రామ్మూర్తి స్మారక జాతీయ పురస్కారం అందుకున్నారు. తెలుగు భాషా దినోత్సవం జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని పురస్కరించుకొని ఆదివారం కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవ సంస్థ సీఈఓ ఉలవలపుడి వెంకటరత్నం, జాతీయ కమిటీ ప్రోగ్రాం డైరెక్టర్ ధనశి ఉషారాణి, భవాని సాహిత్య సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ చేతుల మీదుగా సురేశ్ పురస్కారం అందుకున్నారు. కాగా, సురేశ్ నవయుగ శతకం, దశధీరులు, కావ్య ఖండికతో పాటు అనేక పద్యాలు, రచనలు రాశారు. సురేశ్ ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ఇడిపిలవంచ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా కొప్పూరు గ్రామస్తులు, సహ ఉపాధ్యాయులు.. సురేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ..

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- కక్కిరాలపల్లి క్రాస్ సమీపంలో ఘటన


ఘటనాస్థలిలో క్షతగాత్రులు, బైక్

ఐనవోలు: గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం సాయంత్రం మండలంలోని కక్కిరాలపల్లి క్రాస్ సమీపం వరంగల్–ఖమ్మం రహదారిపై చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పున్నేలు గ్రామానికి చెందిన చాట్ల నవీన్, వరుసకు బావ మరుదులైన ధర్మసాగర్ మండలం క్యాతంపల్లి గ్రామానికి చెందిన జక్కుల సన్నీ, జక్కుల బన్నీ వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి క్రాస్ సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లి వేడుకకు హాజరయ్యారు. అనంతరం నవీన్ ద్విచక్ర వాహనంపై బావమరదులు సన్నీ, బన్నీలతో కలిసి పున్నేలుకు బయలుదేరాడు. ఈ క్రమంలో కక్కిరాలపల్లి క్రాస్ సమీపంలో వరంగల్–ఖమ్మం రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొనగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న ప్ర యాణికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. అయితే ప్రమాదం జరిగి గంటదాటినా ఘటనా స్థలికి 108 వాహనం రాకపోవడంపై పలువురు మండిపడ్డారు. తీవ్ర గాయాలైన ఒకరిని ముందు ఆటోలో తరలించగా మరో ఇద్దరిని 108లో ఆస్పత్రికి తరలించారు.

బొగతలో పర్యాటకుల సందడి..



వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి సమీపంలో ఉన్న బొగత జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవుదిన కావడంతో భారీ సంఖ్యలో తరలొచ్చారు. ఈ సందర్భంగా జలపాతం జలధారలను వీక్షించడంతోపాటు సెల్ ఫోన్లలో బంధించారు. కొలనులో స్నానాలు చేస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగి సందడి చేశారు. ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు. నడిచి వెళ్లలేని పర్యాటకుల కోసం రైడర్ వాహనం ఏర్పాటు చేసి జలపాతం వద్దకు తరలించారు.

పంటకు ప్రయోజనకారి..

- సుడోమోనాస్, ట్రైకో డెర్మావిరిడి పొడి మందులతో తెగుళ్లు అంతం..
- విత్తనశుద్ధి, భూసారం, పంట పెరుగుదల కూడా ఈ మందులతో పెంపు


విత్తన, మొక్క శుద్ధి, మిశ్రమ తయారీ విధానం

దోర్నకల్: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం విరివిగా పెరుగుతోంది. దీంతో భూమిలో సారం తగ్గడంతోపాటు దిగుబడులు తగ్గుతున్నాయి. ఫలితంగా రైతులు అప్పులపాలవుతున్నారు. అంతేకాకుండా రసాయన పురుగు మందుల వినియోగంతో మిత్ర పురుగులు అంతరించడంతో పాటు వాతావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. ఫలితంగా నేల కాలుష్యంతో నేలసారం తగ్గడం, వ్యవసాయ ఉత్పత్తుల్లో పురుగు మందుల అవశేషాలు ఉండి నాణ్యతాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. ఇలాంటి అనేక దుష్పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వీటిని అధికమించడానికి సమగ్ర సస్యరక్షణ పద్ధతులను రూపొందించారు. ఇందులో భాగంగా రసాయన మందులకు ప్రత్యామ్నాయంగా జీవశిలీంధ్ర నాశినిలుగా గుర్తింపు పొందిన సుడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి పొడి మందులను వినియోగంలోకి తీసుకొచ్చి కాలుష్యాన్ని అరికడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. సుడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి వినియోగంతో విత్తనశుద్ధి, పంట ఎదుగుదల, తెగుళ్ల నివారణ లాంటి ప్రయోజనాలు ఉన్నాయి. సుడోమోనాస్ బ్యాక్టీరియా మొక్కల్లో ఆక్సిజన్, జిబ్బరిలిన్లను ఉత్పత్తి చేసి పంట ఎదుగుదలకు సహాయపడడమే కాకుండా వ్యాధి నిరోధకశక్తిని పెంచుతాయి. పంట తొలిదశలో వీటిని వినియోగిస్తే ఎక్కువ సమర్థవంతంగా పని చేస్తాయి. సుడోమోనాస్ కేజీ రూ.150, ట్రైకోడెర్మావిరిడి కేజీ రూ.100 చొప్పున వ్యవసాయ కార్యాలయాలు, ఫర్టిలైజర్ దుకాణాల్లో లభ్యమవుతాయి.

సుడోమోనాస్, ట్రైకోడెర్మా విరిడి పొడి మందులు వినియోగించే పద్ధతులు..

విత్తన శుద్ధి..

కిలో విత్తనానికి 8–10 గ్రాముల పొడిమందు సరిపోతుంది. లేదా పొడి మందు 10 మి.లీ నీటితో కలిపి విత్తనశుద్ధి చేయొచ్చు. అరటి, పసుపు దుంపలు, చెరుకు ముచ్చెలను శిలీంధ్ర ద్రావణంలో కలిపి ముంచి నాటాలి. 500 గ్రాముల ట్రైకోడెర్మా విరిడి పొడి 100 లీటర్ల నీటిలో కలిపి ఉపయోగించుకోవాలి.


మిశ్రమాన్ని సిద్ధం చేస్తున్న రైతులు

వేర్లను శుద్ధి చేయడం..

వరి, వంకాయ, టమాట, మిరప పైర్లను కిలో సుడోమోనాస్ ఫార్ములేషన్ నిల్వ ఉండే నీళ్లలో కలిపి వాటి వేర్లను గంట సమయం పాటు ఈ నీటిలో ఉంచిన తర్వాత నాటకుంటే తెగుళ్లను నివారించడమే కాకుండా పెరుగుదలను పెంచుతుంది.

భూమిలో చల్లే విధానం..

ఎకరాకు 2 నుంచి 3 కిలోలు దుక్కిలో వేయాలి. కిలో సుడోమోనాస్ ఫ్లోరోసెన్స్, 10 కిలో గ్రాముల వేప పిండి, 90 కిలోగ్రాముల బాగా చితికిన పశువుల ఎరువుతో మిశ్రమాన్ని తయాలు చేసి వారం రోజులు నీడలో ఉంచి దుక్కిలో వేసుకోవాలి. వేప పిండి, పశువుల ఎరువు అందుబాటులో లేకుంటే ఇసుకతో కలిపి వాడొచ్చు.

పిచికారీ..

కిలో పొడి మందును 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పైరుపై పిచికారీ చేయాలి.

వినియోగంలో ఈ జాగ్రత్తలు పాటించాలి...

- వినియోగించే ముందు భూమిలో తేమ ఉండేలా చూసుకోవాలి.
- వీటిని కంపోస్ట్, ఇతర పశువుల ఎరువులు, జీవ సంబంధ పదార్థాలతో కలిపి వాడొచ్చు.
- రసాయన పురుగుమందులతో కలిపి వాడకుంటే పంటలకు మేలు.
- చల్లని ప్రదేశంలో నిల్వ చేయాలి.
- మిశ్రమాన్ని తయారు చేసిన ఆరు నెలల లోపు వాడాలి.

పంట పేరు	సుడోమోనాస్, ట్రైకోడెర్మా విరిడి పొడి మందులతో అరికట్టే తెగుళ్లు
వరి	అగ్గితెగులు, మెడవిరుపు, పాముపొడ తెగులు
పత్తి	(బ్యాక్టీరియా), ఎండు తెగులు
మిరప	నారుకుళ్లు, వేరుకుళ్లను నివారిస్తాయి
వేరుశనగ	ఆకుపచ్చ, ఎండుతెగుళ్లు
మినుము, శనగ	ఎండుతెగుళ్లు
పొద్దుతిరుగుడు	వేరుకుళ్లు
మామిడి	నల్లమచ్చల తెగుళ్లు(ఆన్ త్రక్నస్)
పామాయిల్	మొక్క ఎదుగుదల, దిగుబడి పెరగడం (సుడోమోనాస్, ట్రైకోడెర్మావిరిడి కలిపి వాడాలి)

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

- తాళ్లపూసపల్లిలో ఘటన


మురళి మృతదేహం

కేసముద్రం: కుటుంబ కలహాలతో ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని తాళ్లపూసపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వలసాని మురళి(39) కొంత కాలంగా మద్యానికి బానిసై భార్య రేణుకతో తరచూ గొడవ పడుతూ చనిపోతానని బెదిరించేవాడు. ఈ క్రమంలో శనివారం మురళి భార్య రాఖీ పండుగ సందర్భంగా తన తల్లిగారింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న మురళి మద్యం తాగి మత్తులో చెరువుకట్టపై గడ్డిమందు తాగి పడిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించడంతో వారు వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మురళి అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి అన్న యాకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆదివారం తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రేపాకలో వ్యక్తి..

రేగొండ: ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని రేపాకలో చోటు చేసుకుంది. ఎస్సై షాఖాన్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సామర్ల బాబు (47) ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య అహల్య, ఇద్దరు కుమారులు రాజు, అజయ్ ఉన్నారు.

దేవాదుల, సమ్మక్క బ్యారేజీని పరిశీలించిన మంత్రులు


దేవాదుల నీటిని చూపిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క


సమ్మక్క బ్యారేజీని పరిశీలిస్తున్న మంత్రులు

ఏటూరునాగారం/కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెంలోని సమ్మక్క–సాగర్ బ్యారేజీ, దేవాదుల వద్ద పంపుహౌస్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదివారం సందర్శించారు. ప్రాజెక్టులోని పలు దశల పనులను అధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో మంత్రులు మాట్లాడారు.

జీజీహెచ్ భవనం పైనుంచి పడి రోగి మృతి


ఐలయ్య (ఫైల్)

నెహ్రూసెంటర్: ఓ రోగి ప్రమాదవశాత్తు మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మూడో అంతస్తు నుంచి పడి మృతి చెందాడు. మృతుడి బంధువుల కథనం ప్రకారం... మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న నాగారం గ్రామానికి చెందిన నాయిని ఐలయ్య (55) జ్వరంతో బాధపడుతూ ఈ నెల 7వ తేదీన జీజీహెచ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున చికిత్స పొందుతున్న వార్డు బాల్కనీ నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ఘటనపై వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య యాదమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.